
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 9 జూలై 2024

బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి 8లో..

8లో.. మాజీ సీఎం వైఎస్సార్ జయంతి వేడుకలు



ఎమ్మెల్యే విజయరమణారావుకు మ్యాప్ ద్వారా వివరిస్తున్న అధికారులు

పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి అడుగులు

- 7.78 టీఎంసీల సామర్థ్యంతో ప్రతిపాదనలు
- ముంపునకు గురవుతున్న 1,700 ఎకరాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని పెద్దపల్లి జిల్లాకు అందించేందుకు ఎప్పటి నుంచో ప్రతిపాదనలో ఉన్న పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. 7.78 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ ను నిర్మించాలని భావిస్తున్నారు. ఈ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణం చేపడితే 1,700 ఎకరాల భూములు ముంపునకు గురి కానున్నాయని నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించారు. ఇందులో 400 ఎకరాల అటవీశాఖ భూములు కాగా, 1300 ఎకరాల పట్టా భూమిని సేకరించాల్సి ఉంటుంది. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే పెద్దపల్లి జిల్లా రైతుల చిరకాల వాంఛ నెరవేరనున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని లక్షా 80 వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతున్నది. ఎస్సారెస్పీ నీటిని వార బంది పద్ధతిన పంటలకు విడుదల చేస్తూ ఉంటారు. కాల్వ చివరి భూములైన ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, రామగిరి, మంథని, రామగుండం మండలాల్లోని చివరి ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందక పంటలు ఎండిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని జిల్లాలోని ఎస్సారెస్పీ ఆయకట్టు భూములకు అందించి స్థిరీకరణ చేసేందుకు ధర్మారం మండలం పత్తిపాక వద్ద ఒక రిజర్వాయర్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు. ఐదు టీఎంసీలు లేదా పది టీఎంసీల సామర్థ్యంతో చేపట్టాలని భావించారు. మొదట 1.56 టీఎంసీల సామర్థ్యంతో ఒక ప్రతిపాదన, ఏడు టీఎంసీల సామర్థ్యంతో మరొక ప్రతిపాదనను నీటిపారుదల శాఖ అధికారులు రూపొందించారు. కానీ ప్రభుత్వం పత్తిపాక రిజర్వాయర్‌ను చేపట్టేందుకు ముందుకు రాలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా వరద కాలువ నుంచి ఎస్సారెస్పీ కాలువకు మధ్య మూడు కిలోమీటర్ల వరకు కాలువను నిర్మించారు. అయితే దీని ద్వారా రైతులకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు నీటిని తరలించినప్పుడు మాత్రమే లింకు కాలువ ద్వారా సాగునీరు అందనున్నది. అయితే ఇది తాత్కాలికమే. శాశ్వత పరిష్కారం రైతులకు లభించాలంటే పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం తప్పనిసరి చేపట్టాల్సిందే.

● అధికారులతో ఎమ్మెల్యే విజయరమణారావు సమావేశం..

ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాను గెలిస్తే పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఎదురు మంజూరు చేయించి పూర్తి చేయించి రైతుల చిరకాల వాంఛను నెరవేరుస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సైతం పత్తిపాక నిర్మాణం చేపట్టాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఈ మేరకు 15 రోజుల క్రితం మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కలిసి రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులకు విన్నవించారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే విజయరమణరావు నీటిపారుదల శాఖ అధికారులతో పెద్దపల్లిలో సమావేశం అయ్యారు. రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి మ్యాప్‌ల ద్వారా చేపట్టాల్సిన ప్రతిపాదనల గురించి ఎస్సారెస్పీ సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ సంతు ప్రకాష్ రావు, జేఈ హరీష్, మోతె ప్రాజెక్టు మేనేజర్ కిరణ్‌కుమార్‌తో చర్చించారు. దీకొండ వద్ద గల పైప్‌లైన్ నుంచి రిజర్వాయర్‌లోకి నీటిని సరఫరా చేయవచ్చని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. రిజర్వాయర్ నుంచి ఎస్సారెస్పీ డి 83, డి 86 కాలువలకు గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. వారం రోజుల్లోగా ప్రతిపాదన సిద్ధం చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు అధికారులను ఆదేశించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి నిధుల కేటాయింపు చేయించేందుకు మంత్రి శ్రీధర్ బాబు తో పాటు విజయరమణా రావు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు.

ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లాలో పారదర్శకంగా జరగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి క్యాడర్ ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ, పెండింగ్ కోర్టు కేసులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఉద్యోగ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ బదిలీలకు అవకాశం ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లా క్యాడర్ పోస్టుల బదిలీ ప్రక్రియ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులలోని నిబంధనల ప్రకారం నాలుగు సంవత్సరాలు ఒకే చోట సర్వీసు పూర్తి చేసిన సిబ్బందిని తప్పనిసరిగా బదిలీ చేయాలన్నారు. అదే సమయంలో రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, జూలై 9 నుంచి జూలై 12 వరకు బదిలీల కోసం దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లోని ప్రాధాన్య క్రమంలో బదిలీలు చేపట్టడం జరుగుతుందని, జిల్లా స్థాయి క్యాడర్ బదిలీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఎటువంటి అవకతవ కలు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బదిలీ కోసం వచ్చిన దరఖాస్తు వివరాలను నమోదు చేసి పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి నిబంధనల ప్రకారం బదిలీ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుం దన్నారు. జిల్లాస్థాయి క్యాడర్ పోస్టుల బదిలీ దరఖాస్తులను కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ పరిశీలిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ, పంచాయతీరాజ్, ఖజానా శాఖ, విద్యాశాఖ, సంక్షేమ శాఖలు, రెవెన్యూ శాఖ, మొదలగు వివిధ శాఖల్లో బదిలీల ప్రక్రియ స్థితిగతులను కలెక్టర్ తెలుసుకొని అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల వివరాలు శనివారం నాటికి అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి

పెద్దపల్లి రూరల్, జూలై 8: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 10న నిర్వహించే డిమాండ్స్ డే కరపత్రాలను సోమవారం మండలంలోని అప్పన్నపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటియూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేస్తామనడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలని ప్రైవేటీపరం చేస్తున్నారని, అందులో భాగంగానే కొత్త బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించకుండా కార్పొరేట్ సంస్థలకు ఇవ్వడానికి వేలం వేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్మికశాఖ మంత్రిని కూడా ఇప్పటివరకు నియమించలేదని, అనేక రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. ఈసమస్యలు పరిష్కరిం చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వివిధ రంగాల కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జూలై 10న మండల, పట్టణ పారిశ్రామిక కేంద్రాల్లో డిమాండ్స్ డేను నిర్వహించాలని సీఐటీయూ పిలుపునిచ్చిందన్నారు. జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు జూలై 10న పెద్ద ఎత్తున డిమాండ్స్ డే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు నరేష్, ఎండీ ముస్తాఫా, రాజయ్య, శ్రీకాంత్, రాజేశం, శ్రీనివాస్, నర్సయ్య, చంద్రయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

రామగిరి, జూలై 8: మండలంలోని కల్వచర్ల, లొంకకేసారం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఇన్‌చార్జి ఏవో ప్రమోద్ సోమవారం తనిఖీ చేశారు. గ్రామంలోని పలు ఎరువులు, పురుగుల మందుల, విత్తన నాణ్యతల నమూనాలను సేకరించారు. అనుమతి లేని ఎరువులు, విత్తనాలు అమ్మినట్లయితే తగిన చర్యలు చేపడతామని ఎరువుల యజమానులను హెచ్చరించారు.

మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

- వార్డులను శుభ్రంగా ఉంచాలి - ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు ప్రారంభం



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, అధికారులు

పెద్దపల్లిటౌన్, జూలై 8: పట్టణ పారిశుధ్యంపై ఎమ్మెల్యే విజయరమణారవు మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించేందుకు ట్రాక్టర్లు, అలాగే హరితహారం మొక్కలను సంరక్షించేందుకు వాటర్ ట్యాంకర్లను సోమవారం ప్రాంభించారు. అనంతరం విజయరమణారావు మాట్లాడుతూ మున్సిపల్‌లో 100 మంది సిబ్బంది ఉన్నా పారిశుధ్యంపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఒక్కొక్క ప్రాంతానికి రెండు మూడు నెలలు గడిచినా చెత్త సేకరించే కార్మికులుకాని, శుభ్రపరిచే కార్మికులు వెళ్లడం లేదన్నారు. దీనికి కమిషనర్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వార్డుల వారీగా ఇన్‌చార్జిలను నియమించి వార్డులను శుభ్రంగా ఉంచాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. వన మహోత్సవంలో లక్షా 25 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా ఉందని, దీనిని శ్రద్ధతో పూర్తిచేసి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయ నిర్మాణపనులు నత్తనడకన జరుగుతున్నాయని మూడు నెలల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మొత్తం 45 లక్షల 95 వేల రూపాయలతో నిధులతో ట్రాక్టర్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. పట్టణంలో అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి అయినట్లు వెంటనే పనులు ప్రాంభించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, నూగిళ్ల మల్లయ్య, ఉప్పు రాజు, రాజం మహంత, అమ్రీష్, గాదే మాధవి, సయ్యద్ మస్రత్, తాడూరి శ్రీమాన్, నూగిళ్ళ వీరేష్, బొడ్డుపెల్లి శ్రీనివాస్, సయ్యద్ మస్రత్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మేనేజర్ శివప్రసాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్లు రామ్మోహన్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని ఏ వార్డులో సమస్యలు కన్పించొద్దు..

పెద్దపల్లి పట్టణంలోని ఏ వార్డులో సమస్యలు కన్పించకుడదని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మున్సిపల్ అధికారులను సూచించారు. సోమవారం వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా 24, 25 వార్డుల్లో పర్యటించిన అనంతరం విజయరమణారావు వార్డు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం పూర్తి ప్రణాళికలు సిద్ధం చేసి టెండర్లు పిలిచామన్నారు. ఇప్పటికి టెండర్ల ప్రక్రియ పూర్తిఅయిందన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నాటిన మొక్కలను కళాశాల యాజమాన్యం విద్యార్థులు సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వార్డు కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య ,కార్తీక్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్, మెప్మా సిబ్బంది, విద్యుత్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌గా ఆంజనేయరాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంజనేయరాజు

జ్యోతినగర్, జూలై 8: రామగుండం ఎన్టీపీసీ సీఐఎస్ఎఫ్ యూనిట్ డిప్యూటీ కమాండెంట్‌గా ఎస్ ఆంజనేయరాజును నియమించారు. హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయ రాజుకు డిప్యూటీ కమాండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ ఎన్టీపీసీకి బదిలీ చేశారు. ఈ మేరకు ఆంజనేయరాజు సోమవారం రావగుండం ఎన్టీపీసీ డీసీగా బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఆంజనేయరాజు స్థానిక ఎఫ్‌సీఐ ప్రాంతానికి చెందిన వాడే కావడం విశేషం.

'వనమహోత్సవం'లో ప్రజలు భాగస్వామ్యం కావాలి



నర్సరీని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

కాల్వశ్రీరాంపూర్, జూలై 8: వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని మడిపల్లికాలనీలో నర్సరీని పరిశీలించారు. అనంతరం గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాలను సందర్శించి మొక్కలు నాటారు. గ్రామస్థులకు మొక్కలు అందజేశారు. పెగడపల్లిలో నర్సరీని సందర్శించారు. గ్రామంలో స్వశక్తి మహిళలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుట్టు మిషన్ల ద్వారా కుడుతున్న బట్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ ఇంటింటా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ రవీందర్, ఎంపీడీఓ రామ్మోహనచారి, ఎంపీఓ గోవర్ధన్, ఏపీఎం మంజుల, ఏపీఎం కనకయ్య, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మొక్కల పంపిణీ

రామగిరి, జూలై 8: మండలంలోని పన్నూరు, బుధవారంపేట్ గ్రామపంచాయతీల్లో సోమవారం ఎంపీడీవో శైలజారాణి మొక్కలను పంపిణీ చేపట్టారు. మొక్కల నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఏపీవో ఈసీ లక్ష్మణ్, రజిత, పంచాయతీ సెక్రెటరీ శ్రీధర్, సరిత, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజావాణి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్



ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూలై 8: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ , జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్‌తో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరెల్ల లచ్చయ్య గ్రామ శివారులోని సర్వే నంబర్ 133లో 10 గుంటలు, 16లో 21 గుంటల భూమి మోఖాపై వరి పంట వేసుకుంటున్నామని, పట్టా చేయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. ఎలిగేడు తహసీల్దార్ కార్యాలయానికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సుల్తానాబాద్ నుంచి గుంపుల వరకు ఆర్అండ్‌బి రోడ్డుకు కొన్నిచోట్ల గుంతలు ఉన్నాయని, వాటిని మరమ్మతు చేయాలని కోరుతూ మడక మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య దరఖాస్తు సమర్పించగా, ఈఈ ఆర్అండ్‌బీకి రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దబొంకూర్ గ్రామంలోని రెండో వార్డులో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారని, వర్షపు నీరు వెళ్లేందుకు పైపులు వేయలేదని, వర్షపు నీటి ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని, వర్షపు నీటిని మురికి కాలువలోకి మళ్ళించాలని కోరుతూ గ్రామస్థుడు కే సతీష్ కుమార్ వినతిపత్రం అందించాడు. కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని సూచించారు. ఓదెల మండలం జీలకుంట గ్రామానికి చెందిన ఆడెపు భాగ్యమ్మ తన భర్త ఆడెపు సాంబమూర్తి 2020 జూలై 25 న కరోనా కారణంగా చనిపోయారని, కరోనా పరిహారం, వితంతు పెన్షన్ అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ర్యాకల్‌దేవ్‌పల్లిలో సర్వేనంబర్ 226 బై 8 రక్బాల్, వివాదస్పదంగా ఉందని నారాయణపూర్ గ్రామానికి చెందిన అన్నమనేని రఘుపతిరావు ఫిర్యాదు చేయగా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారు లు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● 'ప్రజాపాలన' దరఖాస్తులను పరిష్కరించాలి..

పెద్దపల్లి రూరల్: ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా వస్తున్న అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. సోమవారం పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ఎదురవుతున్న ఇబ్బందులు, పరిష్కరించాల్సిన వివరాలు కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సమయంలో నమోదు చేసిన ఫోన్ నంబర్లను ఎడిట్ చేసే అవకాశం లేదని, అదే విధంగా కుటుంబసభ్యుల వివరాలు దరఖాస్తు, రేషన్ కార్డు వ్యత్యాసం ఉండటం వంటి పలు రకాల ఇబ్బందులను అధికారులు తెలియజేయగా, కలెక్టర్ వాటి పరిష్కారానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, ఎంపిడీఓ శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ సర్వేయర్ గణేష్ సస్పెన్షన్

పెద్దపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల సర్వేయర్ గణేష్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఒక బాధితుడు తన భూమిని కాల్వశ్రీరాంపూర్ రెవెన్యూ సర్వేయర్ తక్కువ కొలతలు వేసి తనకు నష్టం కలిగించాడని ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ తహసీల్దార్ నుంచి పూర్తి నివేదిక తీసుకొని సర్వేయర్ జాటోత్ గణేష్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

సెప్టెంబరులోపు పెండింగ్ సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు లోపు పెండింగ్ సీఎంఆర్ రైస్ డెలివరీని తప్పనిసరిగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ జిల్లాలోని రైస్ మిల్లర్లు, సంభందిత అధికారులతో 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ రైస్ డెలివరీపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, 2019 నుంచి ప్రతి సీజన్ లో సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేసిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న చిన్న, చిన్న మొత్తాల సీఎంఆర్ రైస్ డెలివరీకి సెప్టెంబర్ చివరి నాటికి మాత్రమే గడువు ఉందని అన్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు మొత్తం 10వేల 187 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ రైస్ డెలివరీ పెండింగ్ ఉందన్నారు. దీనికి పెనాల్టీ కలుపుకొని మొత్తం 27 వేల 983 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ సెప్టెంబరు లోపు డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సీఎంఆర్ రైస్ డెలివరీ గడువు పెంపు ఉండదని, నిర్దేశిత సమయంలోగా మిల్లుల వారీగా తమకు కేటాయించిన లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. సీఎంఆర్ రైస్ బాకీ ఉన్న రైస్ మిల్లర్లు సకాలంలో మిల్లింగ్ చేసి సీఎంఆర్ రైస్ అప్పగించకపోతే మిల్లర్లపై తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ ప్రేమ్ కుమార్, డీటీసీఎస్, రైస్‌మిల్లర్లు, సంబంధితఅధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

రాయికల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

మినీ బ్రిడ్జి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్, జూలై 8: రాయికల్ పట్టణంలో వివిధ గ్రామాలను అనుసంధానం చేస్తూ వెళ్తున్న రోడ్డులో నిర్మిస్తున్న మినీ బ్రిడ్జిలను నాణ్యతా ప్రమాణాలతో వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రాయికల్ పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని సంబంధిత అధికారులను బాధ్యులుగా చేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గత వారంలో మైతాపూర్ రోడ్డులో గల బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు 11 కేవీ స్తంభానికి అంటుకుని ప్రమాదపుటంచుల్లో వెళ్లిందని, వెంటనే బ్రిడ్జిలను పూర్తి చేయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి కోరుట్ల, మేడిపల్లి, వేములవాడకు సంబంధించినటువంటి రవాణా కూడా ఈ బ్రిడ్జిలపై నుంచే వెళ్తూ ఉండటంతో వచ్చే వర్షాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా వాటిల్లకుండా వెంటనే నిర్మాణాలను పూర్తి చేసి పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా విడుదల చేసి కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కురుమ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కుంబోజి రవి, బొడుగం శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు కోల శంకర్, కునారపు భూమేష్ బీసీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, రామన్న, ఐటీ సెల్ అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్, కటకం కిషోర్, బీజేవైఎం నాయకులు బుర్ర గోపి, బంటి, బూత్ అధ్యక్షుడు రామకృష్ణ, అల్లె నర్సయ్య, శేఖర్, ఎల్లాగౌడ్, రాజేంద్రప్రసాద్, కంటె భూమేష్, ఇద్దాం గంగారెడ్డి, కట్ట రాము, నర్సయ్య పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జూలై 8: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని పెగడపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన గోపగోని రాజయ్య(40) అనే గీత కార్మికుడు సోమవారం తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. రాజయ్య తలకు కాళ్లకు చేతులకు నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన రాజయ్యను కుటుంబసభ్యులు పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే అభివృద్ధి

- ఇక అభివృద్ధిపైనే దృష్టిపెడదాం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు



సిరిసిల్లలో మాట్లాడుతున్న బండి సంజయ్

సిరిసిల్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు అయిపోయాయి.. ఇకపై ఒకరినొకరు తిట్టుకోవడం బంద్ చేద్దాం, విమర్శలు, ఆరోపణలు పక్కన పెట్టి అభివృద్ధిపై ఫోకస్ చేద్దామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే అభివృద్ధి జరుగుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల, వీర్నపల్లి, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. సిరిసిల్లకు వచ్చిన బండి సంజయ్‌కు బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. సిరిసిల్లలో రూ. 10 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపం ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామాలు, పట్టణాలు,



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పక్షాన సంపూర్ణ సహకారం అందించే బాధ్యత తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. కుల సంఘాల కార్యాలయాలు నిర్మిస్తే ఆసంఘంలోని నాయకులకే ఉపయోగపడుతుందని కానీ కుల సంఘాల తరఫున కల్యాణ మండపాలు నిర్మిస్తే ఆ కులంలోని ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని అలాంటి వాటికే ఎంపీ నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏ కుల సంఘం అయినా ఆ కులంలోని పేదలకు సహాయ, సహకారాలు అందిస్తూ ఆదుకున్నప్పుడే కుల సంఘాలకు మనుగడ ఉంటుందన్నారు. మీలో ఒకడిగా మున్నూరు కాపు సంఘం చేపట్టే ప్రజోపయోగ పనులకు తన వంతుగా సహకారం అందిస్తానని అన్నారు.

రెండోసారి ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో సిరిసిల్ల జిల్లా ప్రజల భాగస్వామ్యం ఉందన్నారు. రెండోసారి గెలవడం వల్లనే మోదీ కేబినేట్‌లో చోటు దక్కిందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. నిధులు తీసుకవచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ ఛైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్య క్షుడు దేవయ్య, పట్టణ అధ్యక్షుడు అగ్గిరాములు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, కౌన్సిలర్ కల్లూరి రాజు, సంఘం ప్రతినిధులు శీలం రాజు, దుమాల శ్రీకాంత్, నీలి శంకర్, ఎరుకల ప్రకాష్, కుల్ల సత్తయ్య, నాయిని కిషన్, బాలయ్య, నర్సయ్య, వేణు పాల్గొన్నారు.

విద్యార్థులపై తెగిపడిన విద్యుత్ వైర్లు

- గంగాధరలోని బీసీ గురుకులంలో ఘటన
- ఇద్దరు విద్యార్థులకు విద్యుదాఘాతం
- తప్పిన ప్రమాదం




చికిత్స పొందుతున్న అశ్విత్



విద్యార్థికి అయిన గాయాలు

గంగాధర, జూలై 8: విద్యుత్ తీగలపై కోతులు ఎగరడంతో వైర్లు తెగి విద్యార్థులపై పడగా విద్యుదాఘాతంతో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. వైర్లు తెగిపడగానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గంగాధరలోని బీసీ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి నియోజకవర్గ బీసీ గురుకుల బాలుర పాఠశాల గంగాధర బ్లాకులోని ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. సోమవారం ఉదయం తరగతులకు వెళ్లేందుకు విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. పాఠశాల బాత్‌రూంల పైనుంచి గంగాధర, లక్ష్మీదేవి పల్లి ఎక్స్‌ప్రెస్ 11కేవీ విద్యుత్ లైను ఉంది. అయితే ప్రతి రోజు విద్యార్థులు తినగా మిగిలిన ఆహారం పక్కనే పడేస్తారు. పాఠశాల పక్కనే చెట్లపైనుంచి కోతులు ఆహారం కోసం వస్తుంటాయి. సోమవారం కోతులు 11 కేవీ వైర్లపై నుంచి ఆహారం కోసం వస్తున్న సమయంలో అవి తెగిపడ్డాయి. అప్పుడే కాలకృత్యాలు తీర్చుకుంటున్న ఆరో తరగతి విద్యార్థి ఎ అశ్విత్‌పై విద్యుత్ తీగపడింది. విద్యుత్ వైరు తెగిపడగానే సబ్‌స్టేషన్‌లో ఫీజు కొట్టేసి సరఫరా నిలిచి పోయింది. విద్యార్థిపై తీగపడగా పొట్టభాగంలో, కుడిచేతిపై గాయాలయ్యాయి. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న ఓ. అశ్విత్ కాళ్లపై తీగ పడటంతో స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే సిబ్బంది వీరిద్దరినీ 108లో కరీంనగర్ తరలించారు. ప్రస్తుతం ఇద్దరికి ఎలాంటి ప్రాణాపాయం లేదు. ఏ అశ్విత్ డిశ్చార్జికాగా మరో విద్యార్థిని డిశ్చార్జి చేయనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈఘటనను చూసిన మరో ఇద్దరు విద్యార్థులు స్పృహతప్పి పడిపోగా స్థానిక వైద్యశాలలో చికిత్స అందించారు.



పాఠశాల నుంచి ఉన్న 11 కేవీ విద్యుత్ లైను

నిత్య కల్యాణానికి మంగళసూత్రాలు బహూకరణ

ధర్మపురి, జూలై 8: ధర్మపురి క్షేత్రం లోని శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో జరిగే నిత్యకల్యాణానికి హైద్రాబాద్ వాస్తవ్యులు శృత ప్రీతి, సునీత, సత్యవతి, సరిత, సరళ, రెండు జతల బంగారు సూత్రాలను సోమవారం సమర్పించారు. సుమారు నాలుగు లక్షల విలువ గల మంగళసూత్రాలు ప్రతి నిత్యం స్వామివారి కల్యాణం సమయంలో అలంకరణ కోసం కార్యాలయంలో ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు. వారందరిని ఆలయ పక్షాన ఈ ఓ శ్రీనివాస్ స్వామి శేషవస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు.



ఈవో శ్రీనివాస్‌కు మంగళసూత్రాలు అందజేస్తున్న దాతలు

మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు హుస్సేన్ అరెస్ట్


మహ్మద్ హుస్సేన్

జమ్మికుంట, జూలై 8: కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, సికాసా వ్యవస్థాపక కమిటీ సభ్యుడు మహ్మద్ హుస్సేన్ అలియాస్ సుధాకర్, అలియాస్ రమాకాంత్‌ను సోమవారం తెల్లవారు జామున పోలీసులు అరెస్ట్ చేశారు. 1977లో మహ్మద్ హుస్సేన్ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2009లో జార్ఖండ్ రాష్ట్రంలో పోలీస్‌లు ఆయనను అరెస్ట్ చేశారు. జైలు జీవితం అనుభవించిన అనంతరం 2011లో జమ్మికుంటకు వచ్చారు. అప్పటి నుంచి హుస్సేన్ ఇక్కడే ఓ ఇంటిలో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఆయన సోదరుడి కుమారుడు రబ్బాని ఇంటి పక్కనే ఉంటూ అలానాపాలన చూసుకుంటున్నాడు. హుస్సేన్ కొంత కాలంగా బీపీ, షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల కంటి సమస్య తలెత్తడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కంటికి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు బంధువులు తెలిపారు. సోమవారం తెల్లవారు జామున పోలీస్‌లు సివిల్ డ్రెస్‌ల్లో మహ్మద్ హుస్సేన్ ఉంటున్న ఇంటికి చేరుకున్నారు. నిద్రపోతున్న మహ్మద్ హుస్సేన్‌ను లేపి వెంట తీసుకువెళ్లారు. ఈ సమయంలో పక్క ఇంట్లోనే ఉంటున్న హుస్సేన్ సోదరుడి కుమారుడు రబ్బాని వచ్చి ఎవరు మీరు, ఏం కావాలి, ఎక్కడికి తీసుకు వెళ్తున్నారంటూ ప్రశ్నించినా సమాధానం చెప్పకుండానే తీసుకు వెళ్లారని అతడు తెలిపాడు. హుస్సేన్ వద్ద ఉదయం 11గంటల సమయంలో రబ్బాని ఫోన్‌కు పోలీసుల నుంచి ఫోన్ వచ్చింది. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్‌ను మాట్లాడుతున్నానని, హుస్సేన్‌ను ఓ పాత కేసులో విచారణ నిమిత్తం తాము తీసుకు వచ్చామని, మంచిర్యాల కోర్టులో హాజరుపరుస్తామని చెప్పి ఫోన్ కట్ చేశారు. దీంతో రబ్బాని కుటుంబ సభ్యులు వెంటనే రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తెలిసింది. 1971లో హుస్సేన్- జిలానిబేగంకు వివాహం జరిగింది. ఆమె 1992లో ఉద్యమంలోకి వెళ్లింది. 1996లో గోదావరిఖనిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమెమృతి చెందింది.


హుస్సేన్ అరెస్టును చూపెడుతున్న ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్, జూలై 8: మావోయిస్టు కీలక నేత మహ్మద్ హుస్సేన్ ఆలియాస్ సుధాకర్ ఆలియాస్ రమాకాంత్‌ను అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. సోమవారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండు నెలలుగా మావోయిస్టు, సికాస భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర ప్రాంతాలలో తిరుగుతున్నాడనే సమాచారంతో సీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏసీపీ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. సోమవారం రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ ఆర్కే-1ఏ గని సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను చూసి

వివరాలు వెల్లడించిన రామకృష్ణాపూర్ పోలీసులు

పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా హుస్సేన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో విచారించగా మావోయిస్టు కరపత్రాలు, డాక్యుమెంట్లు, వాల్ పోస్టర్లు, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మందమర్రికి చెందిన హుస్సేన్ ప్రస్తుతం జమ్మికుంట ప్రాంతంలో నివాసం ఉంటున్నాడని, 1978 నుంచి 1981 వరకు సింగరేణి కార్మికుడిగా కెకె-2 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేశాడని తెలిపారు. ఈ సందర్భంగా మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన

ప్రజాకవి, రచయిత మహ్మద్ హుస్సేన్ అరెస్టు అప్రజాస్వామికమని వెంటనే పోలీసులు ఆయనను విడుదల చేయాలంటూ సోమవారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్ వద్ద పౌర హక్కుల సంఘం, విప్లవ రచయితల, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకులు నిరసన చేపట్టారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, ఉపాధ్యక్షులు సుచరిత, నార వినోద్, సహాయ కార్యదర్శి వినోద్, బోడ్డు రవి, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్ కన్వీనర్ బాలసాని రాజమ్మ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి కన్వీనర్ గాండ్ల మల్లేశం తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తిమ్మాపూర్, జూలై8: మండలంలోని రేణికుంట గ్రామం రాజీవ్ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద పీడీఎస్ బియ్యం తరలిస్తున్న రెండు లారీలను సివిల్ సప్లయ్ అధికారులు, ఎల్ఎండి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా దేవునిపల్లికి చెందిన గురువయ్య అనే వ్యక్తి పలువురి వద్ద నుంచి తక్కువ ధరకు పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి ఆ బియ్యంను పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నరసింహులపేట గ్రామ శివారులో డంపు చేశాడు. డంపు చేసిన బియ్యం రెండు లారీల్లో లోడ్ చేసి సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కి తరలిస్తుండగా ఖచ్చితమైన సమాచారంతో రేణికుంట టోల్ ప్లాజా వద్ద సివిల్ సప్లయ్ ఆధికారులు, ఎల్ఎండి పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. లారీల్లో 452.30 క్వింటాళ్లు, 11,30,750రూపాయల విలువల గల బియ్యం పట్టుకున్నారు. బియ్యంను కరీంనగర్‌లోని యంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌కు తరలించారు. లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకొని, బియ్యాన్ని తరలిస్తున్న గురువయ్య, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు. లారీలను పట్టుకున్న వారిలో తిమ్మాపూర్ సిఐ కె.స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట రూరల్, జూలై 8: జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ గ్రామంలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 38.90క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఆదివారం అర్ధరాత్రి పోలీస్‌లు పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవీందర్ తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు

మానకొండూర్ : మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రేషన్ డీలర్ సురేష్ దుకాణంలో పౌరసరఫరాలు, విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేపట్టారు. దుకాణంలో 33.71 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. డీలర్ సురేష్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన డీలర్ లక్ష్మీనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,414 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,414 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 11.965 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.975 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రైలు ఢీకొని ఒకరి మృతి

కోరుట్ల, జూలై 8 : కోరుట్ల పట్టణానికి చెందిన చిట్యాల నరేశ్ (32) అనే వ్యక్తిని సోమవారం రైలు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఎస్సై కథనం ప్రకారం... మతిస్థిమితం లేని నరేశ్ ఇంటి నుంచి వెళ్లగా చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నిజామాబాద్ రైల్వే ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు

భర్త చేతిలో భార్య హత్య

● అనంతరం తానూ ఆత్మహత్యాయత్నం

మేడిపల్లి, జులై 8: అనుమానం పెనుభూతంగా మారి కట్టుకున్న భార్యను కడతేర్చాడు. మండలంలోని తొంబర్రావుపేట గ్రామానికి చెందిన రాయంచు లింగంకు కట్లకుంట గ్రామానికి చెందిన లక్ష్మి (45)తో 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాలు వీరి దాంపత్యం అన్యోన్యంగా సాగింది. ఇంతలోనే లక్ష్మి గ్రామంలోనే ఒకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త లింగంకు అనుమానం కలిగింది. దాంతో వీరి మధ్య తరచూ గొడవలు మొదలయ్యాయి. లింగం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు, సంవత్సరం క్రితం సెలవుపై వచ్చి కూతురికి వివాహం చేశాడు. అనంతరం లింగం అతని కొడుకు గల్ఫ్ వెళ్లారు. ఉన్నట్టుండి లింగం హటాత్తుగా ఆదివారం సాయంత్రం గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చాడు. రాత్రి బెడ్‌రూంలో నిద్రిస్తున్న తన భార్య మెడకు తాడు కట్టి ఉరివేసి ఇనుప పారతో కొట్టి హత్య చేశాడు. అనంతరం లింగం అక్కడే ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఉదయాన్నే ఇరుగుపొరుగు వారు గమనించి లింగంను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై శ్యామ్‌రాజ్ దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జూలై 8: కరీంనగర్ జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న వ్యాపారి కట్కూరి రాజు(47) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం కట్కూరి రాజు కరీంనగర్ మండలం వల్లంపహాడ్‌లో ఒక ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజులాగే ఈ నెల 7న ఉదయం 10 గంటలకు దుకాణానికి వెళ్లి సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ తరువాత రాత్రి 7 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. సోమవారం ఉదయం రాజు కుటుంబ సభ్యులు రెండో టౌన్ పోలీసులకు సమాచారం అందించగా సాంకేతికతతో రాజు ఉన్న లోకేషన్‌కు వెళ్లి చూడగా అల్కాపురికాలనీలోని ఒక ఎండిపోయిన కుంట దగ్గర పురుగుల మందు తాగి చనిపోయి కనిపించాడు. మెహర్‌నగర్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో రాజు ఒక ఒక ఫ్లాట్‌ను కొనుగోలు చేయగా నిర్మాణం తీవ్ర జాప్యం అవుతున్నందున తరచుగా మనస్థాపం చెందేవాడని, ఈ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య కట్కూరి విజయ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఒకరి అదృశ్యంపై కేసు నమోదు

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 8: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి న్యూమారేడుపాకలో దొంతుల సతీష్ అనే వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యానికి బానిసైన సతీష్ తరచూ భార్య శిరీషతో గొడవ పడేవాడు, భర్త ప్రవర్తనతో విసుగు చెందిన శిరీష తన తల్లి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆదివారం మద్యం సేవించి ఇంటికి రాగా అతిగా తాగుతుండడం, భార్యతో గొడవ పడిన విషయమై సతీష్‌ను తండ్రి మందలించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తండ్రితో గొడవ పడిన సతీష్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు రాకపోవడంతో కుటుంబీకులు వెతికినా సతీష్ ఆచూకీ లభించలేదు. భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్, జూలై 8: మండలంలోని రొంపికుంటకు చెందిన ఓ యువకుడు మనస్తాపానికి గురై సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్(28) అనే యువకుడికి చెందిన గొర్లు అదే గ్రామానికి చెందిన పులిపాక బొంద్యాలు అనే వ్యక్తి తోటలోని బబ్బెర చెట్లు మేశాయి. ఈ మేరకు సోమవారం ఉదయం పంచాయితీకి రావాలని అదే గ్రామానికి చెందిన కటకం రవీందర్ పిలిచారు. కానీ కొయ్యడ కుమార్ సోమవారం ఉదయం తన పొలానికి నీళ్ల పెట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలోనే కొయ్యడ కుమార్ ఇంటికి అదే గ్రామానికి చెందిన వీఆర్ఏ వెళ్లి పంచాయితీకి రావాలని చెప్పగా కుమార్ భార్య రేణుక తన భర్త పొలానికి వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే వీఆర్ఏ కొయ్యడ కుమార్ పొలానికి వెళ్లి చూసేసరికి మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పంచాయితీకి రాకపోతే కేసు పెడుతారన్న భయంతో మనస్తాపానికి గురై తన భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్ప డినట్లు మృతుడు కుమార్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

● మృతుడి కళ్లు సజీవం

గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్ ఆత్మహత్యకు పాల్పడగా గ్రామానికి చెందిన కొడి అనిల్ నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈమేరకు నేత్రదానం చేసేందుకు మృతుడి భార్య ముందుకు వచ్చారు. కరీంనగర్ ఎల్‌వీపీ టెక్నీషియన్ గాజుల సతీష్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఎల్‌విపి ఐ బ్యాంక్‌కు పంపారు. నేత్రదానం చేయటంపై మృతుడి భార్య, తల్లిదండ్రులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ బీష్మాచారి, ముఖ్య సలహాదారులు నూక రమేష్ తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

శంకరపట్నం, జూలై 8: రోడ్డు ప్రమాదంలో గాయ పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన శంకరపట్నం మండలం కొత్తగట్టులో చోటు చేసుకుంది. కొత్తగట్టు గ్రామానికి చెందిన పల్లె రజిత (47) ఈ నెల 5న మధ్యాహ్నం పొలం పనులు ముగించుకొని భర్త మహేందర్‌రెడ్డి కోసం పెద్దగుట్ట దాబా హోటల్ ముందు నిలబడి ఉంది. ఈ క్రమంలో కరీంనగర్ వైపు నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఓ కారు ఢీకొట్టింది. రజిత తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఆర్టీసీలో భారీగా బదిలీలు

భగత్‌నగర్, జూలై 8: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో భారీగా బదిలీలు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. మెట్‌పల్లి డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న జి.వేదవతి హైదరాబాద్ పారుక్‌నగర్‌కు, వరంగల్-2 డిపో మేనేజర్ జి.సురేష్‌ను కరీంనగర్ బస్‌స్టేషన్ ఎటిఎంగా, కరీంనగర్ ఎటిఎం రజనీకృష్ణను లాఆఫీసర్ వరంగల్, గోదావరిఖనికి బదిలీ చేశారు. సిరిసిల్ల డిపో మేనేజర్ ఎస్.మనోహర్ కోరుట్లకు, కోరుట్ల డిపో మేనేజర్ విజయ మాధురి కరీంనగర్-1 డిపోకు, మంథని డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ జెబిఎస్ సిఆర్ఎంకు, కొత్తగూడెం అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ విఎస్‌కుమార్ పదోన్నతిపై మంథని డిపో మేనేజర్‌గా, హైదరాబాద్‌లో పనిచేస్తున్న బి.శ్రీనివాస్ వేములవాడ డిపో మేనేజర్‌గా, వేములవాడలో పనిచేస్తున్న డిపో మేనేజర్ మురళికృష్ణ గద్వాల్ డిపో మేనేజర్‌గా, మెహిదీపట్నం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎ ప్రకాశ్ రావును సిరిసిల్ల డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌ను హుజూరాబాద్‌కు, కరీంనగర్ కార్గో ఎటిఎం సదాశివ్‌ను కరీంనగర్ వర్క్‌షాపులోని టైర్స్ సెక్షన్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్‌గా, భద్రాచలం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న వి రామారావును కరీంనగర్ కార్గో ఎటిఎంగా బదిలీ చేస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 8: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం ఎల్లమ్మగుడి సమీపంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా విలాసాగర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

మెట్‌పల్లి, జూలై, 8 : గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకునట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 6న మండలంలోని మేడిపల్లి శివారులో ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించాడు. అదే సమయంలో అనుమానా స్పదంగా కోరుట్ల పట్టణానికి చెందిన నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై అక్కడి వచ్చారు. పోలీసులను గమనించి ఇద్దరు యువకులు పారిపోగా కోరుట్ల పట్టణానికి చెందిన మరో ఇద్దరు మైనర్లను పట్టుకొని 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించారు. నలుగురు యువకులు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహమ్మద్ అజార్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కోరుట్లకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. నాందేడ్‌లో గంజాయి అమ్ముతున్న మహమ్మద్ అజార్‌ను పట్టుకోవాలని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు ఆదేశాల మేరకు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి అజార్‌ను అదుపులోకి తీసుకుని సోమవారం తీసుకొచ్చారు. మైనర్లకు వైద్య పరీక్షలు చేయించి అనంతరం ముగ్గురిని కరీంనగర్‌లోని జువైనల్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. గంజాయి అమ్మిన, సరఫరా చేస్తున్న వారి వివరాలను పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం

కలెక్టర్ ఎదుట మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం

సుభాష్‌నగర్, జూలై 8: 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేసిన 11లక్షల రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ కలెక్టర్ పమేలా సత్పతి ఎదుట ఓ మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించిన రామడుగు మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త జగన్‌మోహన్‌గౌడ్ ఆమె ముందే మెడకు చేతి రుమాలు చుట్టుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అక్కడ ఉన్న పోలీసులు ఆయనను అడ్డుకొని బయటకు తీసుకెళ్లారు. అనంతరం జగన్‌మోహన్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ చాలా కాలంగా తనకు రావలసిన బిల్లుల కోసం అధికారులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఇవ్వడం లేదన్నారు. రూ.11లక్షల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన చెందారు. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక పోతున్నానని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తేనైనా నాకు న్యాయం జరుగుతుందని భావించానని అన్నారు. వారం క్రితం ప్రజావాణిలో కూడా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి తన గోడు వెల్లబోసుకున్నానని, ఇప్పటికీ డబ్బులు రాలేదని జగన్‌మోహన్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. మన ఊరు..మన బడి పథకంలో భాగంగా పాఠశాల అభివృద్ధి పనులు చేయించారని అన్నారు. ఈ పనులు తమకు సంబంధం లేదని, పాఠశాల అభివృద్ధి కమిటీ చేయాలని చెప్పినప్పటికీ గ్రామ కార్యదర్శి నుంచి కలెక్టర్ వరకు సర్పంచ్‌లపై తీవ్రమైన ఒత్తిడి చేశారని ఆరోపించారు. దీంతో తమ వద్ద డబ్బులు లేకపోవడంతో అప్పులు చేశామని, ఇంట్లో బంగారం, ఎకరాల భూమి అమ్ము కున్నామని వాపోయారు. అప్పులు ఇచ్చినవారు అప్పు తీర్చాలని తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, మంత్రుల చుట్టు తిరిగినా బిల్లులు మంజూరు చేయడం లేదన్నారు. విసిగి వేసారి చివరకు కలెక్టర్ ఎదుట ఆత్మహత్యకు యత్నించానన్నారు. జిల్లాలోని అనేక మంది మాజీ సర్పంచులకు, ఏఎంసీ డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు కూడా మన ఊరు..మన బడి అభివృద్ధి పనులు చేసి బిల్లుల కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు న్యాయం చేసి వెంటనే బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని జగన్‌మోహన్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.


జగన్‌మోహన్‌గౌడ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

'ప్రజావాణి'కి మందుడబ్బాతో వచ్చిన బాధితుడు

సుభాష్‌నగర్:అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా తన సమస్య పరిష్కారం కావడం లేదని ఓ బాధితుడు పురుగుల మందు డబ్బా తో ప్రజావాణికి వచ్చాడు. అయితే పోలీసుల తనిఖీలో ఆయన వద్ద పురుగుల మందు డబ్బా ఉందని గుర్తించి దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు ఒగ్గు రాజమల్లు మాట్లాడుతూ తాను గంగాధర మండలం, సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాడనని, తనకు గ్రామంలో 58 సర్వే నంబ రులో 24 గుంటలు, 59 సర్వే నంబరులో 26 గుంటల భూమి, 447లో 22 గుంటల భూమి ఉందని తెలిపారు. 2005లో కొంత భూమిని తన తండ్రి నుంచి విరాసత్ ద్వారా పొందినట్లు చెప్పారు. ఆ భూమిని తానే సాగు చేస్తున్నానని తెలిపారు. అయితే ఈ భూమిని తాను కాని, తన కుటుంబ సభ్యులు కానీ ఎలాంటి క్రయ విక్రయాలు చేయలేదన్నారు. అయితే పట్టా భూమి పొరపాటున ఇతరుల పేరున ధరణి పోర్టల్‌లో నమోదు అయిందని తెలిపారు. దానిని సరి చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదన్నారు. ధరణిలో అక్ర మంగా తన భూమిపై ఉన్న ఇతరుల పేరును వెంటనే తొలగించాలని కోరారు. తమ సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం 1వ టౌన్ సీఐ సరిలాల్ రాజమల్లు దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రాజమల్లు కలెక్టర్ పమేలా సత్పతికి దరఖాస్తు అందజేసి వెళ్లిపోయారు.


ఒగ్గు రాజమల్లు దంపతులు

కొనసాగుతున్న ఎన్టీపీసీ స్పోర్ట్స్ మీట్

జ్యోతినగర్, జులై 8 : రామగుండం ఎన్టీపీసీలో దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్ రెండోరోజు సోమవారం ఉత్సాహంగా కొనసాగింది. ఎన్టీపీసీ పీటీఎస్ స్పందన ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న బ్యాడ్మింటన్ పోటీలలో రెండో రోజు సింహాద్రి ఎన్టీపీసీ మహిళల జట్టు లీగ్ మ్యాచుల్లో విజయం సాధించింది. మహాత్మాగాంధీ స్టేడియంలో జరిగిన క్రికెట్ లీగ్ మ్యాచుల్లో ఎస్ఆర్‌హెచ్‌క్యూ(హైదరాబాద్) వల్లూర్ ప్రాజెక్టు జట్టుపై 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో సింహాద్రి ఎన్టీపీసీ జట్టు కుడిగి ఎన్టీపీసీ జట్టుపై 13 పరుగుల తేడాతో గెలుపొందింది. ఎన్టీపీసీ సదరన్ స్పోర్ట్స్ మీట్ బుధవారం ముగుస్తుంది.

వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం

హత్య చేసి బావిలో పడేశారని అనుమానం

ముత్తారం, జూలై 8: ముత్తారం మండలంలోని వ్యవసాయ బావిలో ఓ మహిళ మృతదేహం కనిపించింది. గోనే సంచిలో మృతదేహం మూట కట్టి ఉండడంతో ఆమెను ఎవరో హత్య చేసి మూటగట్టి బావిలో పడేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘటన మూడు రోజుల క్రితం జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మండలంలోని ముత్తారం నుంచి పారుపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో గల ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో సోమవారం మూట కట్టి ఉన్న గోనె సంచి నీళ్ల పైకి తేలి దుర్వాసన రావడంతో అటువైపుగా వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తాడుతో కట్టి ఉన్న గోనసంచి మూటను పైకి తీయించి పరిశీలించగా అందులో ఒక మహిళ మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న మంథని సీఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకున్నారు. ఆ మృతదేహం ఎవరిది అనే విషయమై పోలీసులు ఇంకా గుర్తించలేదు. ఇటీవల ఒక మహిళ అదృశ్యం అయినట్లు గోదావరిఖని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఆ మహిళ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కానీ ఎవరూ గుర్తించలేకపోయారు. ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని మృతదేహం ఎవరిదని గుర్తించలేదన్నారు.

బీఎస్ఎన్ఎల్‌లో 4జీ సేవలు

భగత్‌నగర్, జూలై 8: ఉమ్మడి జిల్లాలో 4జీ సెల్ సైట్లను విజయవంతంగా ఏర్పాటు చేశామని కరీంనగర్ జిల్లా డిప్యూటి జనరల్ మేనేజర్ దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో స్వదేశీ పరిజ్ఞానంతో బీఎస్ఎన్ఎల్ 4జీ మొబైల్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ప్రస్తుతం 2జి/3జి సిమ్‌లను 4జీ/5జీ సిమ్‌లకు అప్‌గ్రేడ్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ మొబైల్ చార్జీలను పెంచే యోచన లేదన్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌తో మెరుగైన ఇంటర్నెట్ సేవల అనుభూతి పొందాలని, ఆర్‌సి 249 అన్‌లిమిటెడ్ కాల్స్, 2జిబి డాటాను 45 రోజుల పాటు అందిస్తున్నామన్నారు.

విడుదల కాని 'అమ్మ ఆదర్శ పాఠశాల'ల బిల్లులు

● అప్పులు తెచ్చి పనులు చేసిన మహిళా సంఘాల సభ్యులు


గొల్లగూడెం పాఠశాలలో చేస్తున్న మరమ్మతు పనులు(ఫైల్)


ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో చేస్తున్న మరమ్మతు పనులు (ఫైల్)

సైదాపూర్, జూలై 8: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని భావించిన ప్రభుత్వం మరమ్మతు పనులను మహిళా సంఘాల ఆధ్వర్యంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనులు గుర్తించి అన్ని గ్రామాలలో ఆయా గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షురాళ్ల(వీవో)కు అప్పగించింది. మహిళలు ఎంతో ఉత్సాహంతో అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారు. కానీ 25శాతం నిధులు మాత్రమే ఇప్పటి వరకు విడుదలయ్యాయని మహిళలు తెలుపుతున్నారు. ప్రభుత్వం త్వరగా నిధులు విడుదల చేస్తుందనే ఉద్దేశ్యంతో బంగారం తాకట్టుపెట్టి, అప్పులు తెలిచ్చి పనుల చేస్తే ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి అమ్మ ఆదర్శ పాఠశాల పనుల నిధులను వెంటనే విడుదల చేయాలని వీవోలు వేడుకుంటున్నారు. ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించి మరిన్ని పథకాలలో భాగస్వామ్యం చేయాలని, నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని కోరుతున్నారు.

అప్పులు తెచ్చి మరమ్మతు పనులు చేశాం

- రజిత, వీవో అధ్యక్షురాలు, సైదాపూర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అప్పులు తెచ్చి మరమ్మతు పనులు చేపట్టాం. పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 25శాతం నిధులు మాత్రమే విడుదలయ్యాయి. ఇంకా 75శాతం నిధులు విడుదల కాలేదు. నిధుల మంజూరుకు ఆలస్యం అయితే అప్పుల పాలయ్యే అవకాశముంది. ప్రభుత్వం త్వరితగతిన నిధులు మంజూరు చేయాలి.

భీవండి నుంచి జగిత్యాలకు మద్యం సరఫరా

- 11 మద్యం బాటిళ్లతో పాటు ద్విచక్ర వాహనం సీజ్
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ సీఐ


నిందితులను అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

జగిత్యాల టౌన్, జూలై 8 :మహారాష్ట్రలోని భీవండి నుంచి జగిత్యాలకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురు వ్యక్తులను జగిత్యాల ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద 11 మద్యం బాటిళ్లతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. జగిత్యాల ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ పూర్తి వివరాలు వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామానికి చెందిన నడిమెట్ల రాజు, కొడిమ్యాల అనీల్‌లు టాక్సీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల బీవండి ప్రాంతానికి టాక్సీ కిరాయి వెళ్లి అక్కడ ఇంపీరియల్ బ్లూ కంపెనీకి చెందిన 11 మద్యం బాటిళ్లను రూ. 300 చొప్పున కొనుగోలు చేశారు. వాటిని జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో కర్రీ పాయింట్ నిర్వహించే చంద్రమౌళికి రూ. 650 చొప్పున విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం కరీంనగర్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్, జగిత్యాల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఆదేశాల మేరకు సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు పొలాసలో ఉన్న కర్రీ పాయింట్‌పై దాడులు చేయగా 11 మద్యం బాటిళ్ల ఇతర ప్రాంతం నుంచి తీసుకవచ్చి విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ రాజమౌళి, ఎస్సై స్వప్న, సిబ్బంది గట్టయ్య, మోహన్ లాల్, చందు, కిషోర్, రమేష్, సంతోష్ ఉన్నారు.



మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మన్‌గా జనక్‌ప్రసాద్


జనక్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న సింగరేణి సీఎండీ బలరాం

గోదావరిఖని, జూలై 8: తెలంగాణ రాష్ట్ర మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మన్‌గా సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. సోమవారం వివిధ బోర్డులకు సంబంధించిన చైర్మన్ల నియామకంలో జనక్ ప్రసాద్‌కు ఈ అవకాశం దక్కింది. నాలుగున్నర దశాబ్దాలుగా కార్మికరంగంలో సుదీర్ఘ సేవలు అందించి అనుభవం ఉన్న జనక్ ప్రసాద్‌కు ఈ అవకాశం దక్కడంపై కోల్‌బెల్ట్ ప్రాంత ఐఎన్‌టీయూసీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సిక్కాతో తన కార్మికవర్గ పోరాటాలు ప్రారంభించిన జనక్ ప్రసాద్ దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి సన్నిహితునిగా మెలిగాడు. ఐఎన్‌టీయూసీతో పాటు కాంగ్రెస్ పార్టీతో కూడా సుదీర్ఘ అనుబంధం ఉంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కోల్‌బెల్ట్ ప్రాంత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయంలో కూడా జనక్‌ప్రసాద్ భాగస్వామ్యం ఉంది. జనక్‌ప్రసాద్ నియామకంపై స్పందిస్తూ ఇందు కోసం కృషి చేసిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలకు, కార్మికవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలోని అన్నిరంగాల కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతనాలు అందేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ తెలిపారు. జనక్ ప్రసాద్ మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా సింగరేణి సీఎండీ బలరాంనాయక్ జనక్ ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

సంస్థ పరిరక్షణ కోసం రాజీనామాలు చేయండి

- కోల్‌బెల్ట్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పోరాటానికి మద్దతు ఇవ్వాలి

- మావోయిస్టు పార్టీ డిమాండ్

గోదావరిఖని, జూలై 8: సింగరేణి పరిరక్షణ కోసం కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు తమ పదవులకు రాజీనామా చేసి పోరాటాలకు మద్దతు ఇవ్వాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం గోదావరిఖని మీడియాకు పంపిన సుదీర్ఘ ప్రకటనలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఈ మేరకు డిమాండ్ చేశారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ అగ్ర నాయకులు బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ ఉద్యమానికి వెన్నుపోటు దారులుగా మారారని, పైరవీల కోసం యూనియన్లను, కార్మిక హక్కులను తాకట్టు పెట్టారని ప్రభాత్ ఆరోపించారు. తెలంగాణలో సింగరేణి కొత్త బ్లాకులను వేలం పేరిట ప్రైవేటీకరించేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలపై కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, ఎంపీలు మౌనం వహించడం క్షమించరాని తప్పిదమని పేర్కొన్నారు. సింగరేణి ప్రైవేటీకరకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను సీతారామయ్య, జనక్‌ప్రసాద్ తప్పుదోవ పట్టిస్తూ ఐక్యఉద్యమాలను బలహీనపరిచి క్షమించరాని తప్పులు చేస్తున్నారని ఆరోపించారు. వీరిద్దరు సింగరేణి సంస్థకు, కార్మికవర్గానికి ద్రోహులుగా మారారన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్, వినోద్, ఎంపీలు కడియం కావ్య, గడ్డం వంశీ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సింగరేణికి చెందిన కొత్త గనుల వేలాన్ని రద్దు చేయించాలని ప్రభాత్ డిమాండ్ చేశారు. ఇవి రద్దు అయ్యే వరకు తమ వంతు బాధ్యతగా పదవులకు రాజీనామాలు చేసి పోరాటాలకు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సింగరేణి పరిరక్షణ కోసం ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, తెలంగాణ సబ్బండవర్గాలు, ప్రజాస్వామికవాదులు సింగరేణి కార్మికుల పోరాటాలకు మద్దతుగా నిలువాలని ప్రభాత్ విజ్ఞప్తి చేశారు. సింగరేణి ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలని, సింగరేణి బొగ్గు బ్లాకులను బేషరతుగా సింగరేణి సంస్థకే అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఓపెన్‌కాస్టులను రద్దు చేసి భూగర్భ గనులను ప్రోత్సహించాలని ప్రభాత్ డిమాండ్ చేశారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన సింగరేణి సంఘాల నేతలు


కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్మిక నేతలు

గోదావరిఖని, జూలై 8: సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకులను బహిరంగ వేలంలో పెట్టి ప్రైవేట్ వ్యక్తులచేతుల్లోకి వెళ్లేలా చూస్తే సింగరేణి భవిష్యత్ ఇబ్బందికరంగా ఉంటుందని జాతీయ కార్మిక సంఘాల నాయకులు కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి విన్నవించారు. సోమవారం హైదరాబాద్‌లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్ అగ్రనాయకులు సమష్టిగా మంత్రిని కలిసి విన్నవించారు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న బొగ్గు గనులను ఎంఎండీఆర్ చట్ట పరిధిలోని సెక్షన్ 11ఏ/17ఏ ప్రకారం సింగరేణికే కేటాయించాలని కార్మికనాయకులు మంత్రిని కోరారు. ఇప్పటికే వేలం పెట్టిన కోయగూడెం, సత్తుపల్లి-3, శ్రావణ్‌పల్లి-3, కళ్యాణ్‌ఖని బ్లాకులను సింగరేణికే కేటాయించేలా చర్యలుతీసుకోవాలని కిషన్‌రెడ్డిని కోరారు. సత్తుపల్లి బ్లాక్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే ఓవర్ బర్డెన్ పోయడానికి కూడా వారికి స్థలం లేదని వివరించారు. ఇల్లందులోని కోల్‌బ్లాక్ షెడ్యూల్ ఏరియాలో ఈ ప్రాజెక్టు ఉండడం వల్ల ప్రైవేట్ వాళ్లకు బ్లాక్ కేటాయించినప్పటికీ ఉపయోగం ఉండదని కార్మికనేతలు అన్నారు. ఇది చట్ట విరుద్ధం అవుతుందని కూడా చెప్పారు. మిగిలిన బ్లాకులను కూడా పలు సార్లువేలంలో పెట్టినా ఎవరూ ఆసక్తి చూపలేదని, వాటన్నింటిని నామినేషన్ పద్ధతిలో సింగరేణికే కేటాయించాలని వారు కిషన్‌రెడ్డిని కోరారు. వీకే-7, ఆర్‌కేపీ ఓసీ, ఇల్లందు 21ఇంక్లైన్‌కు పర్యావరణ అనుమతులు రాకపోవడంతో ఉత్పత్తికి ఇబ్బంది ఏర్పడుతుందని, ఆ విషయంలో కూడా సహకరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఒడిస్సాలోని నైని ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు మంజూరు చేసేందుకు కృషి చేసిన కిషన్‌రెడ్డికి ఈ సందర్భంగా యూనియన్ల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్డ్ కార్మికుల పెన్షన్ రివిజన్, కాంట్రాక్టు కార్మికుల హై పవర్ వేతనాలు అమలు లాంటి పలు అంశాలపై మంత్రి కిషన్‌రెడ్డితో సింగరేణి కార్మిక నేతలు సుదీర్ఘంగా చర్చించారు. వీటన్నింటిపై కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్టు, సింగరేణికి అండగా ఉంటానని హామి ఇచ్చినట్టు కార్మిక నేతలు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో సింగరేణి విస్తరణకు కూడా కృషి చేస్తానని మంత్రి హామి ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఏఐటీయూసీ అధ్యక్షులు సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, బీఎంఎస్ నాయకుడు పులి రాజిరెడ్డి, రమాకాంత్, రిటైర్డ్ పెన్షన్ సంఘం నాయకులు జేవీ దత్తాత్రేయులు, కేఆర్‌సీ రెడ్డితో పాటు ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్‌కుమార్‌యాదవ్ ఉన్నారు.

బొగ్గు బ్లాకుల అంశంపై నేడు సదస్సు

గోదావరిఖని, జూలై 8: బొగ్గు బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా మంగళవారం గోదావరిఖనిలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్టు యూనియన్ అధికార ప్రతినిధి పర్లపల్లి రవి ఒక ప్రకటనలో తెలిపారు. 'బొగ్గు గనుల వేలం... సింగరేణి...తెలంగాణ భవిష్యత్...' అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు రవి చెప్పారు. మోదీ కుట్రలపై సదస్సు అనే నినాదంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని, గోదావరిఖని చౌరస్తాలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగే ఈ సదస్సుకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరవుతున్నారని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

రామగిరి, జూలై 8: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. సోమవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2, ఫేజ్‌లో వనమహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భద్రకాళి ఆలయం సమీపంలో ప్రత్యేక పూజల అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాధాకృష్ణ, సీహెచ్ వెంకటరమణ, శ్రీనివాసులు, శేఖర్‌బాబు, కర్ణ, రాజారెడ్డి, ముప్పిడి రవీందర్‌రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, గడ్డం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలానికి నిరసనగా ఏఐటీయూసీ దీక్ష



దీక్ష చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని/యైటింక్లయిన్‌కాలనీ/రామగిరి జూలై 8: తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించకుండా కేంద్రప్రభుత్వం వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నిరసన దీక్షలకు దిగింది. సోమవారం ఆర్జీ-1, 2, 3 జీఎం కార్యాలయాల ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ కు చెందిన నూతన బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి ఇవ్వకుండా వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు అన్నీ కార్యాలయాల వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టినట్టు తెలిపారు. 130సంవత్సరాల చరిత్ర, అనుభవం ఉన్న సింగరేణి కాలరీస్‌కు కేంద్ర ప్రభుత్వం నూతన బొగ్గు గనులను ఇవ్వకుండా పెట్టుబడి దారులకు కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి వేలం ద్వారా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోకుంటే సింగరేణిలోని అన్ని యూనియన్‌లను, రాజకీయ పార్టీలను కలుపుకుని బొగ్గు గనుల్లో సమ్మె చేయడానికైనా ఏఐటీయూసీ సిద్ధమని వారు హెచ్చరించారు. తిఆర్జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో యూనియన్ ఉపప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, దీక్షలో ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, పిట్ కమిటి నాయకులు పాల్గొన్నారు. ఆర్జీ-2 కార్యాలయం ఎదుట ఎల్ ప్రకాష్, రాజారత్నం, జీ రవీందర్, అన్నారావు, బుర్ర తిరుపతి, సాంబశివరావు, సాగర్, కొండ్ర సత్యనారాయణ, జాడి మోహన్, ఆర్జీ-3 కార్యాలయం ఎదుట నాయకులు వై.వీరావు, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, గంగాధర్, వెంకటస్వామి, మల్లేష్, సాంబశివరెడ్డి, తిరుప తిరావు, శ్రీనివాస్, పోచం, ఆర్జీ-3,ఏపీఏ ఫీట్‌కమీటి సభ్యులు పాల్గొన్నారు.

● కలర్ కార్డుల విధానాన్ని రద్దు చేయాలి...

గోదావరిఖని: సింగరేణిలో కలర్ కార్డుల విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్రంట్‌లైన్‌లో పనిచేస్తున్న సూపర్ వైజర్లు, కార్మికులకు ఎల్లో, రెడ్ కార్డులు జారీ చేస్తూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. పని స్థలాల్లో ఎలాంటి పొరపాట్లు చేయకున్నా కార్డులు జారీ చేస్తూ కార్మికులను ఆందోళనకు గురిచేస్తున్నట్టు తెలిపారు. కొత్త నిబంధనలు అమలు చేసే క్రమంలో గెలిచిన సంఘాలతో సంప్రదించాల్సి ఉన్నా అటువంటి సాంప్రదాయాన్ని విస్మరించి ఏకపక్షంగా ఈవిధానాన్ని అమల్లోకి తేవడం నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఈవిధానంతో కార్మికులు పూర్తిస్థాయిలో పనిచేయలేరని, కార్మికుడికి సంస్థకు నష్టం జరిగే కార్డుల జారీ విధానాన్ని నిలిపివేయాలని రవీందర్ డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో సైతం ఇటువంటి నిబంధనలు లేవని తెలిపారు. ఈవిలేకరుల సమావేశంలో ఎల్ ప్రకాష్, రాజారత్నం, చంద్రగిరి సాగర్, అన్నారావు, బుర్ర తిరుపతి, సాంబశివరావులు పాల్గొన్నారు.

లంబాడికుంట మత్తడిని పరిశీలించిన అధికారులు

ఎలిగేడు, జూలై 8: ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, ఎలిగేడు శివారులో ఉన్న లంబాడికుంట మత్తడిని కబ్జా చేసి దానిపై మట్టిరోడ్డు వేశారనే ఫిర్యాదు మేరకు సోమవారం మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. లంబాడికుంటకు 2ఎకరాల శిఖం ఉండగా చుట్టూ పక్కల రైతులు కబ్జా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మత్తడికి ఆనుకొని ఉన్న 5గుంటల భూమిని ఏకంగా పట్టా చేసుకున్నారని అధికారుల విచారణలో తేలిందని ఆయకట్టు రైతులు పేర్కొన్నారు. ఈవిషయంపై మైనర్ ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా విచారణ జరిపి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్ర మంలో ఇరిగేషన్ డీఈ శిరాజ్, ఏఈలు అయూబ్‌ఖాన్, శ్రీనివాస్, ఆర్ఐ జయ, ఆయకట్టు ప్రాంత రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిటౌన్, జూలై 8: కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం ఇంటింటా ఇన్నోవేటర్ 2024 సంవత్సరానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు3 లోగా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనేవారు తమ వివరాలు పంపాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం ప్రస్తుతం ఎడిషన్ ఇంటింటా ఇన్నోవేటర్ ప్రోగ్రాం కోసం దరఖాస్తులను స్వీకరిస్తుందన్నారు. అన్ని వర్గాలలో ఉన్న ఆవిష్కర్తలు, జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలలో తమ ప్రతిభను చాటుకునేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం చక్కని వేదికగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు. ఆవిష్కర్తలు తమ ఆవిష్కరణకు సంబంధించిన ఆవిష్కరణ యొక్క నాలుగు చిత్రాలు(హై రిజల్యూషన్), ఆవిష్కరణ విధులను ప్రదర్శించే రెండు వీడియోలు, 100 పదాల్లో ఆవిష్కరణ వివరణ, ఆవిష్కర్త పేరు, ఫోన్ నంబర్, వయసు, ప్రస్తుత వృత్తి, గ్రామం పేరు, జిల్లా పేరు తదితర వివరాలను వెంటనే 9100678543కి వాట్సాప్ చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి, ఈడీఎం కవిత, కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, ఇన్నోవేషన్ మిత్ర మునిందర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లిటౌన్, జూలై 8: బాలికలు, మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మహిళలపై జరిగే హింస నివారణకు మనమంతా కృషి చేసి వారికి అండగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్త్రీలపై హింస నివారణకు, మహిళా సంరక్షణ చట్టాలు తెలుపుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా రూపొందించిన పలు పోస్టర్లను అదనపు కలెక్టర్‌లు జే అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఫోన్ ద్వారా సలహాలను, సహాయాన్ని అందించుటకు మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181 అందుబాటులో ఉందన్నారు. గృహహింస, వరకట్న వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, లైంగిక హింస, ఆడపిల్లల అమ్మకం, రవాణా నివారణ కోసం మహిళలు ఫోన్ చేయాలని, మహిళలకు అవసరమైన సలహా, కౌన్సెలింగ్, రక్షణ చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా అధికారులు, సఖీ సెంటర్ అధికారులు పాల్గొన్నారు.

హుస్సేన్ ప్రాణాలకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత

-మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, జూలై 8: మాజీ మావోయిస్టు నేత హుస్సేన్ ప్రాణాలకు ఏదైనా జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మాజీ మావోయిస్టు నేత హుస్సేన్ అరెస్టుపై డీజీపీ ప్రకటన చేయాలని పుట్ట మధు సోమవారం డిమాండ్ చేశారు. ప్రజాపాలన అని చెప్పుకుంటూ అక్రమ నిర్బంధాలు, అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. తక్షణమే ఈ వ్యవహారంపై డీజీపీ స్పందించాలన్నారు. 15 ఏళ్లుగా జనజీవన స్రవంతిలో ఉంటున్న సింగరేణి ఉద్యమ నాయకుడు, రచయిత మహ్మద్ హుస్సేన్ అలియాస్ రమాకాంత్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని మానవ హక్కులు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయన్నారు.

నిబంధనలు పాటించని బేకరీపై చర్యలు తీసుకోవాలి

మంథని, జూలై 8: నిబంధనను పాటించని, పరిశుభ్రత లేని ప్రదేశంలో ఉన్న బేకరీపై చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీకి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మాచిడి రవితేజ గౌడ్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మంథని సురేష్, బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేల్పుల రాజయ్య, ఎన్ఎస్‌యుఐ డివిజన్ అధ్యక్షుడు కెక్కర్ల సందీప్, మాజీ వార్డు సభ్యులు రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లైసెట్టి రాజు అదనపు కలెక్టర్ అరుణశ్రీని కలిశారు. మంథని పట్టణంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ చౌరస్తా వద్ద గల బేకరీ, స్వీట్ హౌస్ కనీస నియమ నిబంధనలు పాటించకుండా పరిశుభ్రత లేని స్థలంలో ఉన్నాయని వెంటనే వాటిపైన చర్య తీసుకోవాలని వారు కోరారు.

సుల్తానాబాద్‌లో దోమల నివారణ చర్యలు


నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

సుల్తానాబాద్, జూలై 8: సుల్తానాబాద్ పట్టణంలో మున్సిపల్ సిబ్బంది దోమల నివారణ చర్యలను చేపట్టారు. సుల్తానాబాద్ పట్టణంలో డెంగ్యూ కేసును వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గుర్తించారు. నీరుకుళ్ల రోడ్డులోని ఎస్ఆర్ గార్డెన్ ప్రాంతంలో రుద్రారరం విక్కీ డెంగ్యూ సోకింది. దాంతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సోమవారం వారి ఇంటికి చేరుకుని దోమల నివారణ మందు పిచికారి చేయించారు. సమీప అయితే విక్కీ హైదరాబాద్‌లో ఉన్న సమయంలో జ్వరం వచ్చిందని, అయన కరీంనగర్ లో టెస్ట్ చేయించుకోగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలిందని అధికారులు తెలిపారు. డెంగ్యూ పాజిటివ్ కేసు నిర్ధారణ కావడంతో మున్సిపాలిటీ వారు సమీప గృహాలు వీధుల్లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాలలో నీరు నిలువ ఉన్న చోట మందు చల్లారు. గోళాలు, ఇతర ప్లాస్టిక్ డబ్బాలలో నిలువ ఉన్న నీటిని పారబోయించారు. కూలర్లలో నీరు ఖాళీ చేయించారు. సుల్తానాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో ఇప్పటికీ చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నారు.

సమాజహితం కోసం కవులు కలాలను కదిలించాలి

కోల్‌సిటీటౌన్, జూలై 8: సమాజహితం కోసం కవులు వారి కలాలను కదిలిస్తూ ప్రజల్ని చైతన్యపరిచేలా రచనలు చేయాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం రాత్రి గోదావరిఖని తిలక్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శ్రీపదాలు సాహితీ సమూహం నాలుగో వార్షికోత్సవ ఆత్మీయ సమ్మేళనం, వేదనవల పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం రచయిత్రి అనూశ్రీ గౌరోజు రచించిన వేద నవలను, దార స్నేహలత రచించిన శ్రీపద స్నేహితాలు, సొతుకు రత్నజానకి రచించిన మనోహరాలు, యెలిగేటి శ్రీలత రచించిన శ్రీపద కౌముది, వేముల వరలక్ష్మి రచించిన సిరులైన శ్రీపదాలు, పోతుల ఉమాదేవి రచించిన శ్రీపద పారిజాతాలు సంపుటాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీపదాలు సాహితీ వేదిక అధ్యక్షులు జేవి రాజు, పలు సాహితీ వ్యవస్థాపకులు దాస్యం లక్ష్మయ్య, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ పెంట రాజేష్, నాగా నూగూరి, కటారి రామమోహన్, వేణుగోపాల్, రమాదేవి, లలిత పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో గ్రామాల అభివృద్ధి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్


మాజీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న చందర్

గోదావరిఖని, జూలై8: కేసీఆర్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ప్రజాప్రతినిధులుగా గ్రామాల్లో, మండలాల్లో ఐదేళ్ల పాటు ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలుగా పని చేసి పదవీకాలం ముగిసిన పలువురు మాజీలను సోమవారం స్థానిక ప్రధాన చౌరస్తాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అంతర్గాం మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, మాజీ వైస్‌ఎంపీపీ మట్ట లక్ష్మీ మహేందర్‌రెడ్డి, పెద్దంపేట మాజీ ఎంపీటీసీ కొలిపాక శరణ్యా మధుకర్ రెడ్డిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చందర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకం అందిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కృష్ణవేణి, నాయకులు పీటీ స్వామి, నడిపెల్లి మురళీధర్‌రావు, నారాయణదాసు మారుతి, అచ్చేవేణు, చెలుకలపెల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, అనుముల కళావతి, ఈదునూరి నర్సింగ్, సట్టు శ్రీనివాస్, మహేందర్, శ్రావణ్ పాల్గొన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

పెద్దపల్లి రూరల్, జూలై 8: మండలంలోని పెద్దబొంకూర్ గ్రామానికి వెళ్లేందుకు గాను రాజీవ్ రహదారి నుంచి ఇరువైపులా వీధిదీపాలు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందించారు. ప్రధాన రహదారి గ్రామానికి వెళ్లేందుకు సుమారు 800 మీటర్ల దూరం గ్రామం ఉంటుందని గ్రామానికి రాత్రి సమయంలో నడుచుకుంటూ వెళ్లాలంటే విషసర్పాలు, తేళ్లు రోడ్డుపైకి వచ్చి కనిపించని పరిస్థితి ఉందన్నారు. చర్యలు చేపట్టి త్వరగా వీధిదీపాలు వేయాలని వినతిలో కోరినట్లు శ్రీనివాస్ తెలిపారు.

మొహర్రం వేడుకలకు సర్వం సిద్ధం

పాలకుర్తి, జూలై 8: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మొహర్రం పండుగల వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. సోమవారం అన్ని గ్రామాల్లో అగ్ని గుండాలను ఏర్పాటు చేయడంతో పాటు పీరీలను శుభ్రం చేసి చావాడీల వద్ద నెలకొల్పారు. కుల మతాలకు అతీతంగా ముస్లీంలు, హిందువులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకునే పీరీలను సందర్శించిన భక్తులకు చక్కెర, పాలతో తయారు చేసిన పానకాన్ని ప్రసాదాలను పంచిపెట్టారు. చాదర్లను, ముజావర్లకు పలువురు మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల్లోని పీరీలను వీధుల్లో ఊరేగించేందుకు సిద్ధంగా ఉంచారు. పీరీల చావిడి ముందు అలయ్‌లో అగ్నిగుండం రాజేసి దానిచుట్టూ అలయ్ ఆడుతూ యువకులు ఉత్సాహంగా గడిపారు. ముసిం యువకులు, పెద్దలు, పీరీలను ఎత్తుకునే హిందూ యువకులు ఉపవాస దీక్ష చేపట్టారు.

మాజీ సీఎం వైఎస్సార్ జయంతి వేడుకలు




సుల్తానాబాద్ నివాళులర్పిస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, గోదావరిఖనిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

సుల్తానాబాద్, జూలై 8: దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సుల్తానాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఎంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, దామోదర్‌రావు, పన్నాల రాములు, బిరుదు కృష్ణ, రాజలింగం, దుగ్యాల సంతోష్‌రావు, తిరుపతి, కౌన్సిలర్లు రాజయ్య, రఫీ, చింతల రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు వేగోళం అబ్బయ్యగౌడ్, చిలుక సతీష్, ఇల్లెందుల శ్రీనివాస్‌గౌడ్, జానీ, మొబిన్, మండల రమేష్, పోచం, చిలుక రాజేశం తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: గోదావరిఖనిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహించగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ఇల్లు కట్టుకున్న 17వేల ఇండ్లకు పట్టాలు ఇచ్చిన ఘనత రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, కాల్వ లింగస్వామి, దిటి బాలరాజు, బొమ్మక రాజేష్, చుక్కల శ్రీనివాస్, ఎండీ ముస్తఫా, కొలిపాక మల్లయ్య, గట్ల రమేష్, కొప్పుల శంకర్, యుగంధర్, కౌటం సతీష్, నాయిని ఓదెలు, మారంగుల రమేష్, నజీముద్దీన్, ధూళికట్ట సతీష్, పంజా శ్రీనివాస్, ఆడెపు రవి, గుమ్మడి రవి, శ్రీనివాస్‌రెడ్డి, గుంపుల తిరుపతి, గడ్డం శీను, కీర్తి నాగరాజు, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గతంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రూప్లానాయక్, కాంగ్రెస్ నాయకులు చింతల జగన్‌మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, దేవి జనార్దన్, కాంపెల్లి రాజేశం, కాడె సూర్యానాయణ, పాలకుర్తి రాజేశం, దేవి లావణ్య పాల్గొన్నారు.

పాలకుర్తి: మండలం పరిధిలోని బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో, కన్నాల టోల్ ప్లాజా వద్ద డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య అధ్యక్షతన, పుట్నూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు వైద్య నరేష్ అధ్యక్షతన వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కేశోరాం పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం బసంత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పుట్నూర్‌లో మహిళలకు నరేష్ గొడుగులను పంపిణీ చేశారు.

మంథని: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు వైఎస్సార్ చిత్రపటానికి వారు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద వైఎస్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పీహెచ్‌సీ ఆవరణలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీలు మల్యాల రాంచంద్రంగౌడ్, కోలేటి మారుతి, గడప కృష్ణమూర్తి, నర్సాగౌడ్, దాసరి గట్టయ్య, ఎండీ ముస్తాక్, బిళ్ల కృష్ణ, రఫీక్, మల్యాల మహేష్‌గౌడ్, అన్నవేణ లక్ష్మీరాజం, గట్టయ్య, ఇంతియాజ్, అఫ్సర్, అనిల్,జంగిల్ కొమురయ్య ఉన్నారు.

ఎలిగేడు: మండలంలోని అంబేడ్కర్‌చౌక్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కొప్పుర తిరుమల్‌రెడ్డి, సింగిరెడ్డి రాంచంద్రారెడ్డి, ముంజం ముత్యాలు, పర్శంరాంగౌడ్, శ్రీనివాస్, రమేష్, రాజమల్లు, రాజు, ఓదెలు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, సాగంటి శంకర్, కిషన్‌నాయక్, దేవనపల్లి చక్రపాణి, వై తిరుపతి, అనుము రాములు, తిరుపతిరెడ్డి, సారయ్యనాయక్ పాల్గొన్నారు.

అంతర్గాం: అంతర్గాం మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఉరి మెట్ల రాజలింగం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్రు హనుమాన్ రెడ్డి, నాయకులు ఒల్లెపు స్వామి, పూదరి సత్తయ్యగౌడ్, కొదురుపాక పవన్, బాణాల రాములు, అంగోత్ నూరి నాయక్, మాధవరావు, గజ్జెల్లి శంకర్, అప్పల రాజేందర్, నక్క రాజ్ కుమార్ యాదవ్, వెంకట్ రెడ్డి, గుమ్ముల శ్రీకాంత్, ఉట్నూర్ చంద్రయ్య పాల్గొన్నారు.